దొంగ

రావు సిగరెట్లు కాల్చటం తగ్గించాడు. సినీమాకు వెళ్ళి యే నెలరోజులో దాటింది. కాలేజీకి తప్ప కనీసం బైటి కెళ్ళటంకూడ మానేశాడు.

కాలేజినుండి రాగానే గదిలో కిటికీ ప్రక్కనే ఉన్న మంచంమీద కూర్చుని వీధిలోకి చూస్తూ తీవ్రంగా ఆలోచిస్తూ ఉంటాడు. పొద్దు పోవటంలేదు అనుకుంటాడు. బైట కెళ్ళి రోడ్డుమీద తలఎత్తుకు తిరగాలీ అంటే భయం. జేబులో కాస్త చిల్లరయిన లేకుండ వెడితే వెలితిగ ఉంటుందని ఎలాగో ఇంటి నాలుగు గోడలమధ్య కాలం వెళ్ళబుచ్చుతున్నాడు రావు.

మార్చి '66 ఆంధ్రసచిత్రవారపత్రికలో ప్రచురితము

డబ్బు సంపాదన— ఎట్లా?— రావు మస్తిష్కంలో మెదలాడే సమస్యలు ఇవే! పుష్కలంగ డబ్బు జేబునిండా ఉండాలని ఆశ—దాని వెనుక తాను సంపాదించలేక పోతు న్నాననే నిరాశ, నిస్పృహ.

కాలేజీ చదువు పూర్తి కాకముందే తండ్రి రావుని ఒక ఇంటివాడ్ని చేశాడు. ఇల్లరికం వచ్చిన రావు మామగారి దగ్గర చిల్లర డబ్బులు అడిగి తీసుకునేందుకు సంకోచపడు తున్నాడు. పిల్లనిచ్చి ఇల్లరికం తెచ్చుకుంది చాలక అస్త మానం ఆయన్ను డబ్బుకోసం వేధించటం బావుండదను కుంటూ ఉంటాడు.

అప్పులు— బైట కాలుపెడితే అప్పులు. ఉసుళ్ళకు మల్లే అప్పులవాళ్ళు వెంటబడతారనే భయం— అయితే ఎన్నాళ్ళు యిట్లా తప్పుకు తిరగటమానే ఆలోచనతో సతమత మవుతున్నాడు.

శ్రీమతి అయినా దగ్గరుంటే బావుండు అన్పించేది. మరో రెండు రోజులు గడుస్తేనే గాని మేనమామగారింటి నుంచి ఆమె రాదు— రెండు రోజులు— ఎంత దారుణంగ గడవాలి—

సంపాదించటం మొదలుగాక ముందే తండ్రి తనను గృహస్థుడుగ చేసినందుకు నిత్యం మనసులో నిందిస్తూ ఉం టాడు. కనీసం భార్య అయినా ఏ ఉద్యోగమో చేసి సంపా దిస్తూ ఉంటే భర్త తనకున్న అవసరాలను గడుపుకుంటూ బాధలను తీర్చుకోవచ్చు. ప్రపంచంలో ఎంతమంది భార్యలు సంపాదించి పెడుతుంటే, భర్తలు తింటూ కూర్చుని హాయిగ,

ఆనందంగ రోజులు వెళ్ళదీయటంలేదు— పోనీ మామగా రయినా "అయ్యో అల్లుడిదగ్గర డబ్బులున్నాయో లేవో" అని పరామర్శించి, ఆంతర్యం కనుక్కుంటూ సమస్యను పరిష్కరిస్తే ఎంత బావుండు అని అంతరాంతరంలో వాపోతుంటాడు రావు. భార్య వచ్చాక అయినా తనకు ఇన్ని అప్పులు, ఇబ్బందులు ఉన్నాయని చెప్పి డబ్బు సర్దుబాటు చేయమని అడగటం మాత్రం యేం భావ్యంగ ఉంటుందనిపించింది. పైగా తన చేతగానితనానికి, అసమర్థతకు ఏమనుకుంటుందో ననే భయం మరోవైపు రావును పీక్కుతింటోంది.

అవసరాలు తీరేదెలాగో, సమస్యను ఏవిధంగ పరిష్కరించాలో అర్థంగాని రావు సతమత మవుతున్నాడు. పోనీ దొంగతనం చేస్తే?—అమ్మో—అలాంటి ఆలోచనరాగానే రావుకి వళ్ళంతా చెమట పట్టింది. గుండె వేగంగ కొట్టుకోనారంభించింది. దొంగతనం చెయ్యకముందే ఇంత భయంగ ఉందే తీరా ఆపని చేశాక 'హార్టు ఫేలవు'తుందేమోని భయపడ్డాడు.

'దొంగ' అనే పదానికి సమాజం యెంత దారుణమైన భయాన్ని ఏర్పరిచింది. అవసరాలు తీరక, తీర్చుకునే మార్గం కన్పించక మరోవిధంగ ఆపని నెరవేర్చుకుంటే వాడు దొంగ ఎట్లా అవుతాడు?_పోనీ పట్టుబడితే దొంగ? అదీ న్యాయమే. కేవలం మరోవిధంగ అవసరం తీర్చుకున్నంత మాత్రాన దొంగగా పరిగణించటం అన్యాయంగా రావు మనస్సుకు తోచింది.

వేళకు ఫలహారాలకు లోటులేదు. టైం ప్రకారం అత్తగారు మరదలు ద్వారా తన గదిలోకి పంపుతునే ఉంది. అయితే మిగతా ఖర్చుల సంగతి మామగారికి చెప్పాలను కుంటాడు. కానీ నోరు పెగిలి బైటకు మాటరాదు. అల్లుడు బజారయినా వెళ్ళకుండ, ఇంటిపట్టున ఉండి చదువుకుంటు న్నాడు గాబోలనే తృప్తితో నవ్వుకుంటున్నారు మామ గారు.

పేక ఆడుకునేందుకయినా ఇంట్లో ఎవరూ లేరు. ఎంత సేపని మరదలుతో కేరమ్సు ఆడతాడు—అప్పటికీ పొద్దు పోవటానికి రేడియో పెడతాడు—నావల్సు చదువుతూ ఉంటాడు.

భార్య ప్రక్కన లేనందున జేబులో డబ్బులేక బజారు పోనందున అంతా యాంత్రికంగ తయారైనట్లుగ ఉంది.

వూరికి వెడుతూ శ్రీమతి పాపను గూడ తీసుకెళ్ళింది. లేకపోతే పాపతోనైన కాస్త కాలక్షేపంగ ఉండేది. ఈవారం రోజుల్లో పాప ఎంత పెద్దదయి ఉండవచ్చు అనే ఆలోచన రాగానే, రావు మనస్సులో పాపను చూద్దామనే దుగ్ధ బయ ల్దేరింది.

సాయంత్రం ఐదు గంటలు కావస్తోంది. కాఫీ త్రాగ టం ముగించిన రావు వాకిట్లో కొచ్చాడు. ప్రక్కనే ఉన్న చిల్లరకొట్లో బాకీచేసి వో సిగరెట్ పాకెట్ పుచ్చుకున్నాడు. సిగరెట్ మీద సిగరెట్ వెలిగిస్తు వాకిటి ముందున్న అరుగు మీద కూర్చున్నాడు.

దూరంగ కేకలు, అరుపులు విన్పించాయి. ఆలోచనలకు అంతరాయం కలగటంతో రావు తల ప్రక్కకు తిప్పాడు. జనం పరుగెడుతూ 'పట్టుకోండి... పట్టుకోండి' అని అరవటం కళ్ళబడ్డది. భయంతో పరుగెడుతూ ముందుకు దూసుకు వెడుతున్న వో ఆగంతుకుడిని, అమాంతం ఎదురొచ్చే లావు పాటి మనిషి పట్టుకున్నాడు. వెనకాల పరుగెడుతున్న జనమంతా గుంపుగ వచ్చి చేరారు. తలా వక చెయ్యి వేశారు. ఆగంతకుడి వళ్ళు హూనం కావటంతో నీరసంగ నడిరోడ్డు మీద పడి పోయాడు. చుట్టూ జనం తలావక రకంగ కేకలు పెడుతు అరుస్తున్నారు.

అరుగుమీద కూర్చుని యిదంతా చూస్తున్న రావు లేచి జనం దగ్గర కెళ్ళాడు. పోలీసులకు పట్టించమని కొందరు-చావగొట్టమని మరికొందరు అంటుంటే విషయ మర్ధంగాని రావు ప్రక్కనే ఉన్న ముసలాయన్ను సంగతేమిటని అడిగాడు. అతనికి కూడ కారణ మేమిటో తెలియక "అసలేం జరిగిందంటు' ఎదురు ప్రశ్న వేశాడు రావును.

అందరి మాటలు ఆకళింపు చేసుకునేసరికి రావుకు వో అరగంట పట్టింది. కేవలం దొంగతనం చేయబోయినంత మాత్రాన ఇంత దారుణంగ శిక్షించటం రావుకి బాధగ తోచింది. అతని పరిస్థితికి సానుభూతి చూపాలన్పించింది. చుట్టూ ఉన్న జనం పల్చబడ్డారు. దొంగ దీన స్థితి, దుర్భర అవస్థ చూచిన రావు 'నువ్వు దొంగవు కావు. పట్టుపడ్డందుకు దురదృష్టవంతుడివి' అన్నట్టు అతని కేసి చూచి ఇక అక్కడ నిలబడలేక ఇంట్లోకి దారితీశాడు.

రాత్రి ఏడు గంటలు కావస్తోంది. ఇంటిముందు బండి ఆగిన చప్పుడైంది పంచలో ఈజీచైర్లో పడుకుని రేడియో వింటున్నాడు రావు. బైటిగేటు తోసుకుని పరుగెత్తుకుంటు వచ్చిన మరదలు రజని "బావా! అక్క వచ్చేసింది" అనేసి ఇంట్లో కెళ్ళింది. పడుకున్నవాడల్లా గభాలున లేచి ఎదురొస్తున్న శ్రీమతిని చూచి పరామర్శించినట్లుగ వో చిరునవ్వువిసిరి చంకలో ఉన్న పాపను చేతికి తీసుకున్నాడు. ప్రేమతో తల నిమురుతూ, గాఢంగ హృదయానికి హత్తుకుని తనివితీర పాపను ముద్దాడాడు రావు. వారం రోజుల తర్వాత తండ్రిని చూడగలిగాననే ప్రేమకొద్దీ తాతగారు పిలిచినా పోలేదు పాప.

భోజనా లయ్యాక అందరు ఒకచోట కూర్చుని కబుర్లోకి దిగారు. పాప తాతగారి వడిలో ఆడుకుంటోంది. శ్రీమతి అందించిన తాంబూలం నములుతూ ఆలోచిస్తున్న రావు దృష్టి అనుకోకుండ పాపమీద కేంద్రీకరింపబడ్డది. రావుకు పాపలో క్రొత్తదనం కన్పించటానికి కారణంగ పాప చేతిన బంగారపు గాజులు లైటు వెలుగులో తళతళ మెరుస్తున్నయి.

'రాధా! పాప చేతికి బంగారపుగాజు లెక్కడివోయి?" శ్రీమతిని అడిగాడు తదేకంగ పాప చేతి గాజులకేసి చూస్తు.

రాధ సమాధానం ఏం చెప్పిందో రావు చెవికి సోకలేదు. వక్కమారుగ రావు ఆలోచనలు సుళ్లు తిరిగాయి. కళ్లు మిరిమిట్లు గొల్పేలా తళతళా మెరుస్తున్న పాప చేతి గాజులు రావు మస్తిష్కాన్ని, ఆలోచనను దూర తీరాలకు లాక్కెళ్లాయి.

"ఏమిటండీ అట్లా చూస్తున్నారు. దిష్టి తగిలేను." అన్నరాధ మాటలు శూలాల్లాగ రావుగుండెను చీల్చివేశాయి. పాప నవ్వేసింది, ఏదో అర్థమైనదానికిమల్లే. రాధ మాటల కంటె పాప నవ్వు రావును భయపెట్టింది. పాప నవ్వుతున్నప్పటికీ తన దృష్టిలో బాధపడుతున్నట్లు, ఏడుస్తున్నట్టు అనిపించింది రావుకు.

పారాడుతూ వచ్చిన పాప రావు వడిలో కూర్చుంది. రావు మామూలు ప్రపంచంలోకి వచ్చాడు

రాత్రి పది గంటలు దాటింది. రావు మంచం ప్రక్కనే మరోమంచం మీద రాధ పడుకుంది. తల్లి దగ్గర పాలు త్రాగుతున్న పాప కళ్లుపెద్దవిచేస్తు లైటుకేసి చూస్తోంది. పాప రెండవచెయ్యి తల్లి నడుంమీద వేసింది. రావు దృష్టి పాప చేతివైపు మళ్లింది. వోమారు రావు గట్టిగ శ్వాస పీల్చి వదిలాడు.

ప్రయాణ బడలికతో వుంటూన రాధ నిద్రపోయింది. కాని రావు మేలుకునే ఉన్నాడు. పడుకున్నవాడల్లా లేచి లైటుతీసి మళ్లీ నడుంవాల్చాడు. రావుకి ఎంతకీ నిద్ర రాకుండ ఉంది. సిగరెట్ వెలిగించి ఆలోచనలను నెమరు వేస్తున్నాడు.

భార్యను డబ్బు సర్దమని అడగటమా? — పాప చేతి గాజులు దొంగతనం చేసి అవసరం గడుపుకోవటమా ??-ఈ రెండు ప్రశ్నలే రావును వేధిస్తున్నయి.

పాప చేతి గాజులు దొంగిలించేందుకు తీర్మానించుకున్నాడు. తనే దొంగతనం చేశాడని ఎట్లా తెలుస్తుంది.

ఎవ్వరూ అనుమానించరు. పైగ ఏ తండ్రీ అలాంటి దారుణమైన అఘాయిత్యానికి పాల్పడడు అనే సమస్యతో విషయం తనదాక రాకుండన్నే సమసిపోతుంది.

చేతికి గాజులుఉన్నా, లేకపోయినా వాటిఆనందం పాపకేం తెల్సు, గాజులు చేతిన లేనందున బాధ అంతకన్నా పాప కర్థంగాదు... కాని పాప అమాయక హృదయం తనను శపిస్తుందేమో? తనవైపు దోషిగచూస్తూ హేళన చేస్తుంది పాప నేరస్తుడిలాగ అసహ్యించుకుంటుంది. పాపకు విషయం తెలిస్తే తనకు దూరంగ ఉంటుంది... కానీ—పాపకు తనెలా దూరం కాగలడు?—తప్పు వప్పుకున్నా పాప తనను క్షమించదు నాన్న దొంగ అని అందరితో చెప్పుకుంటుంది. అది తను సహించలేడు. ఈ విధంగ పాప తనకు దూరం కావటం ఇష్టంలేదు.

దొంగగా తయారైన తను పాపను ఏ ముఖంతో దగ్గరకు తీసుకోగలడు. తెల్లవారితే అందరూ తననే అనుమానిస్తారు. తను తల ఎత్తుకు యెట్లా తిరగడం? — వెంటనే సాయంత్రం జరిగిన సంఘటన కళ్ళల్లో మెదిలింది. పరాయివాడు గాబట్టి వాడిని కొట్టగలిగారు. సంవత్సరమైనా నిండని పసిపాపకు ఇవ్వన్నీ ఏం తెలుసు, తన పిచ్చిగాని! అనుకున్నాడు.

చెమటపట్టిన ముఖాన్ని తుడుచుకున్నాడు. లేచి గదిలో లైటు వేశాడు. రాధ పక్కలో నిద్రపోతున్న పాపను తెచ్చి తన పక్కమీద పడుకోబెట్టుకున్నాడు. లైటు ఆర్పివచ్చి మంచంమీద పడుకున్నాడు రావు.

కిటికీలోంచి వచ్చే చల్లగాలికి రావు ఆలోచనలు కుదుటబడ్డాయి. కళ్ళు మూసుకు పడుకున్నాడు.

జరువుగ తెల్లవారింది. రాధ వచ్చి రావును నిద్ర లేపింది. కళ్ళు తెరిచి చూచిన రావుకి పక్కలో పాప కన్పించ లేదు.

"రాధా! పాపేది?" ఆదుర్దాతో అడిగాడు.

"పాప ఎప్పుడో నిద్ర లేచింది. మీరే తొమ్మిదింటికి లేస్తున్నారు. నిద్రలేవటంలో అమ్మాయికి మీపోలిక రాలేదు లెండి."

హామ్మయ్య అనుకొన్నాడు. శ్రీమతి అందించిన టూత్ బ్రష్ తీసుకున్నాడు. లేచివెళ్ళి అద్దంముందు ముఖం చూసు కుంటు "ఇంతకూ అనుకున్నపని పూర్తికాకుండానే తనకు అంత నిద్ర ఎట్లా ముంచుకొచ్చింది చెప్మా" అనుకున్నాడు స్వగ తంలో.

స్నానం ముగించి వాకిట్లో కుర్చీలో కూర్చుని ఆడు కుంటున్న పాపను, చేతి బంగారపు గాజులను చూచి తృప్తిగ నవ్వుకున్నాడు. క్రితం రాత్రి నిద్ర తనను అంతగ ఆవరించి నందుకు మనసులో మరోమారు తిట్టుకుని, కనీసం ఈ రాత్రి కయినా ఆపనికాస్త ముగించాలని తీర్మానించుకున్నాడు. పాపను దగ్గరకు తీసుకుని హృదయానికి హత్తుకున్నాడు.

భోజన కార్యక్రమం ముగించి కాలేజీకి బయల్దేరాడు. క్లాసులో కూర్చుని లెక్చర్లు వింటున్నాడన్న మాటేగాని రావు ధ్యాస మరోవైపుకు లాగుతోంది. క్లాసు లెప్పుడవుతాయా, ఎప్పుడెప్పుడు చీకటి పడుతుందా అనే ఆలోచనతప్ప మరో

ఆలోచనేలేదు. పుస్తకం తెరిచినా, పాఠం వింటున్నా పాప చేతి బంగారపు గాజులే కళ్ళల్లో సుళ్ళు తిరుగుతున్నయి.

మనస్సు బాగోనందువల్ల మధ్యాహ్నం క్లాసులు మానేసి సరాసరి యింటికి దారితీశాడు. త్రోవలో పాప బంగారు గాజుల భవిష్యత్ మీద కొన్ని కొత్తప్లాన్లు నిర్మించుకుంటు నడుస్తున్నాడు రావు.

గుమ్మంలో అడుగు పెట్టేసరికి రావులో క్రితం క్షణం వరకు మెదలాడుతున్న ఆనందానికి సంకెళ్ళు పడ్డట్టయింది. రావును చూచిన అత్తగారు, మామగారు వకరి ముఖాలు మరొకరు చూచుకుని తలలు దించేసుకున్నారు. రజనిభయంతో బిత్తరి చూపులు చూస్తు నిలుచుండిపోయింది రాధ ముఖం చూపించలేక రివ్వున ఇంట్లోకి వెళ్లింది.

పరిస్థితేమిటో అర్థంగాని రావు నివ్వెర పోయాడు. వో క్షణంసేపు ఆలోచించాడు. వొకరి ముఖాలు మరొక్కరు చూసుకోవటం మినహా అతనికేమీ అర్థంగాలేదు.

ఒక్క అడుగులో ఇంట్లోకెళ్లి తలుపు ప్రక్కనే ఉన్న రాధను "ఏం జరిగింది రాధా?" అడిగాడు రావు.

కేవలం ముఖాన్ని ప్రక్కకు తిప్పుకోవటం తప్ప అంతకన్నా ఏం చేయలేకపోయింది రాధ. రాధ కంటిలో నీరు నిండటం గమనించిన రావు "అసలేం జరిగిందో ఎవ్వరూ చెప్పరేం?" విసుకున్నాడు.

"వరండాలో నుంచి వస్తున్న అత్తగారు "ఆఁ... ఇంకేముంది బాబూ, పాప చేతి బంగారపుగాజులు కాస్తా పోయాయి"

"ఆఁ... ఎట్లా పోయాయి?—"

ప్రక్కనే ఉన్న మామగారు "ఏం లేదు నాయనా. రజని పాప నెత్తుకుని వాకిట్లో పాపను ఆడిస్తున్నదల్లా మీఅత్త గారు రజనిని పిలవగానే పసిదాన్ని అరుగుమీద కూర్చొ బెట్టి లోపలి కొచ్చింది. పాప ఏడుపు విన్పించి రాధ వాకిట్లో కెళ్ళి పసిదాన్ని చంకనేసుకుని ఇంట్లోకి తెచ్చింది. తీరా ఇంట్లో కొచ్చాక చూచుకుంటే ఏముంది, పాప చేతి గాజు ల్లేవు— ఇదంతా జరిగి గంటకూడ కాలేదు. మేమంతా పంచలోనే ఉన్నాం పైగా—" అన్నారు.

"ఆరి రాస్కెల్! పసిపాప చేతిగాజులు దొంగలించేం దుకు వాడికి చేతులెట్లా వచ్చాయి" అనేసి నోటికొచ్చిన ట్లల్లా తిట్టాడు రావు కసికొద్దీ. రావు మాటల్లో, కన్నకూతురి సొమ్ము పోయిందనే బాధ, తినకు దక్కకుండా పోయాయనే ఈర్ష్య మిళితమయినయి.

"ఆఁ. దొంగతనం చేయదల్చుకున్న వెధవకు చిన్నా, పెద్దా భేద మేమిటయ్యా! ఇంతకీ మనకాసొమ్ము ప్రాప్తం లేదు" అనేదో గొణిగారు అత్తగారు.

అదేపని రావు చేసివుంటే అత్తగారన్న మాటలు తనకే వర్తించి ఉండేవిగదా ననే భయం, కన్నబిడ్డ చేతి గాజులు పోయాయనే బాధతో మానసికంగ కృంగిపోయాడు.